చిక్కిన రోడ్డు.. రాకపోకలకు చిక్కు


రైతు బజార్ ఎదుట రోడ్డుపై నిలిపిన వాహనాలు

- ఆక్రమణలతో చిక్కిపోయిన సీకే రెడ్డి రోడ్డు
- అడుగడుగునా బడ్డీ కొట్లు, వాహనాల అడ్డగోలు పార్కింగ్
- గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు
- సమస్యపై దృష్టిసారించని అధికారులు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): నగరంలో ప్రధాన కూడళ్లలో ఒకటిగా ఉన్న కేదారేశ్వరపేటలో రోడ్లు ఆక్రమణలతో రోజురోజుకు కుంచించుకుపోతున్నాయి. ముఖ్యంగా ప్రభాస్ కాలేజీ నుంచి మీసాల రాజారావు బ్రిడ్జి వరకు సీకే రెడ్డి రోడ్డు ఆక్రమణలతో పూర్తిగా నిండిపోయింది. అడుగడుగునా బడ్డీకొట్లు వెలిశాయి. ఆపై రైతుబజారుకు వచ్చే ప్రజలు తమ వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. దీంతో 40 అడుగుల వెడల్పున ఉండాల్సిన రోడ్డు కాస్తా 10 అడుగులకు చిక్కిపోయింది. ఆక్రమణల కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఈ రోడ్డు


సీకే రెడ్డి రోడ్డులో అనధికారిక పార్కింగ్

ఉదయం, సాయంత్రం నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో ఆక్రమణల కారణంగా ఉద్యోగులు, వివిధ పనులకు వెళ్లేవారు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అడుగడుగునా బడ్డీకొట్లు, తోపుడు బండ్లు

అధికార పార్టీకి చెందిన స్థానిక చోటామోటా నాయకుల అండదండలతో కొందరు చిరు వ్యాపారులు రోడ్డును రెండువైపులా ఆక్రమించి తోపుడు బండ్లు, బడ్డీకొట్లను ఏర్పాటు చేసుకున్నారు. పదుల సంఖ్యలో ఏర్పాటు చేసిన బడ్డీకొట్లు, తోపుడు బండ్ల వద్దకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

రైతు బజారు వద్ద వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని సైతం హాకర్లు ఆక్రమించి తోపుడుబండ్లు నిలుపుతున్నారు. రైతు బజార్‌కు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

పట్టించుకోని అధికారులు

ఆక్రమణలతో రైతు బజార్ వద్ద నిత్యం ఉదయం, సాయంత్రం సమయాల్లో గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నెలకుంటున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతు బజార్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సైతం ఆక్రమణలు, వాహనాల అడ్డగోలు పార్కింగులపై చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు, ఈ రోడ్డులో ప్రయాణించే వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆక్రమణల సమస్యను పరిష్కరించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

రైతుబజారుకు దారేది?

కేదారేశ్వరపేటలోని రైతు బజార్ ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఆక్రమణల కారణంగా రైతుబజారు లోపలకు వెళ్లేందుకు దారే ఉండటంలేదు. రైతుబజారు బయట ప్రాంతాన్ని హాకర్లు తోపుడుబండ్లతో ఆక్రమిస్తున్నారు. రైతు బజార్ చుట్టు పక్కల ప్రాంతాలనే కాకుండా లోపలికి వెళ్లే ద్వారాలను కూడా ఆక్రమిస్తున్నారు. రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారులు కొందరు వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. ఫలితంగా రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారులు లోపలికి వెళ్లేందుకు, కూరగాయలు కొని బయటకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రయాణం నరకప్రాయం

సీకే రెడ్డి రోడ్డు మొత్తం ఆక్రమణలో నిండిపోయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం నరకంతో సమానం. రోడ్డును హాకర్లు, బడ్డీ షాపుల నిర్వాహకులు పూర్తిగా ఆక్రమించేస్తున్నారు. గంటల కొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుని సతమతం అవుతున్నాయి.

– బషీర్, స్థానికుడు

క్లుప్తంగా

విజయేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.78 లక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ విజయేశ్వర స్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.3,78,327 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వెంకట రెడ్డి తెలిపారు. ఆలయ హుండీ కానుకలను మంగళవారం లెక్కించామని పేర్కొన్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ తనిఖీ అధికారి స్వజన్ పర్యవేక్షణలో కానుకలను లెక్కించామని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సారి సుమారు రూ.50 వేల ఆదాయం పెరిగిందన్నారు. ఆలయ సిబ్బంది, స్వామివారి సేవకులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

14న లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): స్థానిక పెజ్జోనిపేట (హర్టుపేట)లో కొలుదీరిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వార్ల 50వ కల్యాణ మహోత్సవం ఈ నెల 14వ తేదీన ఘనంగా జరుగుతుందని ఆలయ కార్యదర్శి జె.ఎస్.ఆర్.కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 1975లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట జరిగిందన్నారు. అప్పటి నుంచి ఏటా స్వామి వార్ల కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విగ్రహ ప్రతిష్ట జరిగి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 14నుంచి మూడు రోజుల పాటు స్వామి వార్ల కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతాయని వివరించారు. 14వ తేదీ ఉదయం శ్రీ లక్ష్మీనారాయణస్వామి వార్ల కల్యాణోత్సవం, సాయంత్రం స్వామి వారి నగరోత్సవం, కోలాట ప్రదర్శన, 15వ తేదీన ప్రత్యేక పూజలు, 16వ తేదీన స్వామి వారి పవళింపు సేవ జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు టి.శ్రీనివాసచక్రవర్తి, డాక్టర్ షణ్ముఖ్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ జీఓలపై అవగాహన



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో భవన నిర్మాణాలకు సంబంధించిన జీఓలపై మంగళవారం సాయంత్రం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆడిటోరియంలో నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ప్రజలు, బిల్డర్లు, వ్యాపారవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా ప్లాన్లను దరఖాస్తు చేసుకునే ప్రక్రియ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ (రాజమహేంద్రవరం) శ్రీనివాసులు, నగరపాలక సంస్థ డెప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్‌బాబు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గిరి, లైసెన్స్ టెక్నికల్ పర్సన్లు, ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిని మభ్యపెట్టి బంగారం చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మద్యం, క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన తన కుమారుడు బీరువాలోని బంగారం తీసుకువెళ్లిపోయాడంటూ మంగళవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో వివాహిత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భానునగర్‌కు చెందిన పనస సూర్యుడమ్మ పండ్ల వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన పనస లోకేష్(20) డీమార్ట్ సమీపంలో బండి పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. లోకేష్ మద్యం, ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో తల్లిని మభ్యపెట్టి బీరువాలోని నానుతాడు తీసుకెళ్లిపోయాడు. గత నెల 4న సూర్యుడమ్మ బీరువా తెరచి చూడగా బీరువాలోని నానుతాడు కనిపించలేదు. అప్పటి నుంచి లోకేష్ ఇంటికి రాకపోవటంతో మంగళవారం సూర్యుడమ్మ గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు రోడ్డులో మంగళవారం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన దాతలు డాక్టర్ చిత్ర గురుస్వామి, డాక్టర్ మీనాక్షి, శాంతి సహకారంతో అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారి కడుపు నింపటం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలన్నారు. ఇందుకు గానూ తోచినంతలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్నదానానికి సహకరించిన దాతలను స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.

వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించటం అభినందనీయం

గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 26వ ఇంటర్ పురుషుల ఫేజ్–1 క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. విజేతలకు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం బహుమతులు అందజేసి మాట్లాడారు. వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించటం అభినందనీయమన్నారు. వైద్య విద్య అభ్యసించే ప్రతి ఒక్కరు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. యూనివర్సిటీ కూడా క్రీడలను ప్రోత్సహించేందుకు బడ్జెట్ కేటాయిస్తోందని చెప్పారు. 26వ పురుషుల క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు.

విజేతలకు ట్రోఫీలు అందజేత..

కబడ్డీలో విన్నర్‌గా రాజమండ్రి జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల, రన్నర్‌గా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల నిలిచాయి. వాలీబాల్‌లో విన్నర్‌గా విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కళాశాల, రన్నర్‌గా గుంటూరు మెడికల్ కళాశాల నిలిచాయి. బాస్కెట్ బాల్‌లో విన్నర్‌గా గుంటూరు ఎన్నారై మెడికల్ కళాశాల, రన్నర్‌గా డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల నిలిచాయి. బాల్


విజేతలతో హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ నరసింహం, సిద్ధార్థ అకాడమీ యాజమాన్యం


బాడ్మింటన్‌లో విన్నర్‌గా విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల, రన్నర్‌గా విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల నిలిచాయి. చెస్‌లో విన్నర్‌గా కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల, రన్నర్‌గా అనంతపూర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. సిద్ధార్థ అకాడమి అధ్యక్షులు మలినేని రాజయ్య, కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. అనిల్‌కుమార్, హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవినేని రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి సేవలు కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రసన్న కుమార్, ఎ.అశోక్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలకు యూనివర్సిటీ కేంద్రం తెలంగాణలో ఉందని, రాష్ట్ర విభజన జరిగిన అనంతరం పదేళ్లు సేవలు కొనసాగించాలని నిర్ణయించారని పేర్కొన్నారు. పదేళ్లు కావడంతో తెలంగాణ ప్రభుత్వం ఏపీలో సేవలను ఆకస్మికంగా నిలిపివేసిందని తెలిపారు. దీంతో ఇప్పటికే కోర్సులో చేరి పరీక్ష రాయాల్సిన విద్యార్థులు రెండు లక్షల మంది ఉన్నారని, కోర్సు పూర్తికాక పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకో సెమిస్టర్ పూర్తయితే డిగ్రీ పట్టా తమ చేతికి వస్తుందని, ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే పట్టా వస్తుందో లేదో పరీక్షలు నిర్వహిస్తారో లేదోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఏటా సుమారు 35 వేల మంది విద్యార్థులు యూనివర్సిటీలో చేరుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి విశ్వవిద్యాలయం కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసి ఉపకులపతిని నియమించాలని కోరారు.

ఎగ్జిబిషన్ సొసైటీ పూర్వ వైభవానికి కృషి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దశాబ్దాల చరిత్ర ఉన్న కృష్ణా పారిశ్రామిక, వ్యవసాయ ఎగ్జిబిషన్ సొసైటీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని, సొసైటీ కార్యకలాపాలకు జవసత్వాలు తెచ్చేందుకు సమగ్ర కార్యాచరణ అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ.. ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులతో సమావేశమయ్యారు. 1975 మొదలు సొసైటీ కార్యకలాపాల్లో చోటుచేసుకున్న ఘటనలను సభ్యులు వివరించారు. కలెక్టర్ నేతృత్వంలోని సొసైటీ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నిర్వహణతో పాటు వివిధ సందర్భాల్లో సొసైటీ ద్వారా చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. విద్యా రంగంలోనూ సొసైటీ భాగస్వామ్యాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉన్న విజయవాడ సమగ్రాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఇలాంటి నగరంలో ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాలను క్రియాశీలం చేసి, నూతనుత్తేజం తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. సొసైటీ వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ఆధునికతకు అనుగుణంగా ఎగ్జిబిషన్ల నిర్వహణపై దృష్టిసారించడం జరుగుతుందన్నారు. సొసైటీలోని సీనియర్ సభ్యుల ఆలోచనలకు తోడు పరిశ్రమలు మొదలు వివిధ రంగాల్లోని యువ శక్తి భాగస్వామ్యంతో సొసైటీ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందని చెప్పారు. సొసైటీ ద్వారా ఎప్పటికప్పుడు క్రమంతప్పకుండా ఎగ్జిబిషన్ల నిర్వహణకు తద్వారా నగరంలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు సమష్టి కృషి, పటిష్ట ప్రణాళిక అవసరమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి జీవీ రామారావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రామ్ ప్రసాద్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళ కనిపించడం లేదంటూ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు అందడంతో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. లంబాడీపేట అడ్డరోడ్డు ప్రాంతంలో వణుకూరు వినోద్‌కుమార్ తన భార్యతో కలిసి నివసిస్తున్నాడు. వినోద్‌కుమార్ ఓ ప్రయివేటు సెక్యూరిటీ కంపెనీలో గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం వినోద్‌కుమార్ డ్యూటీ దిగి ఇంటికి వచ్చే సరికి అతని భార్య ఇంటి వద్ద కనిపించలేదు. చుట్టు పక్కల వారిని ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. ఆమె సర్టిఫికెట్లు, దుస్తులు, కొంత నగదు కనిపించలేదు. తన భార్య కనిపించడం లేదంటూ వినోద్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హరివంశ పఠనం భక్తి ముక్తిదాయకం

విజయవాడకల్చరల్: హరివంశ పఠనం భక్తి ముక్తిదాయకమని ఆచార్య శలాక రఘునాథ శర్మ అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ వర్ధంతి సందర్భంగా దుర్గాపురంలో శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం వేదవ్యాసుడు రచించిన హరివంశం అంశగా ఆయన ప్రసంగించారు. రఘునాథ శర్మ మాట్లాడుతూ.. మహాభారత శేషంగా హరివంశం రాయబడిందన్నారు. భారతీయ పురాణాలు ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతాయని తెలిపారు. భారతీ తీర్థ వర్ధంతి సందర్భంగా ఉదయం దేవాలయంలో చండీ పారాయణం, నవ చండీహోమం నిర్వహించారు. శిష్టా హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

జ్యోతీరావ్ పూలే జీవితం యువతకు ఆదర్శం

విజయవాడకల్చరల్: మహాత్మా జ్యోతీరావు పూలే జీవితం యువతకు ఆదర్శమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. చెలిమి విజన్ చిత్ర యూనిట్ ఆధ్వర్యంలో బుక్‌ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో మంగళవారం పూలే చిత్ర యూనిట్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ పూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. మహిళలు చదువుకున్నప్పుడే దేశ ప్రగతి సాధ్యమని, ఆ దిశగా కృషి చేశారని తెలిపారు. మహిళా విద్యకు ఆద్యుడు పూలే అన్నారు. సభకు అధ్యక్షత వహించిన గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. అధిక శ్రమకోర్చి చిత్రాన్ని నిర్మించి దర్శకత్వం వహించిన దర్శకుడు చెలిమి సుందరరావును చిత్ర యూనిట్‌ను అభినందించారు. నాటి సమాజంలో సతీసహగమన దురాచారం ఉండేదని, దానిని నిర్మూలించడానికి ఆయన తపన పడ్డారన్నారు.


మాట్లాడుతున్న ఇంతియాజ్ అహ్మద్, గోళ్ల నారాయణరావు, సుందరరావు తదితరులు

సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ జ్యోతీరావు పూలే ఆశయాల అమలు కోసం యువత కృషి చేయాలని సూచించారు. వివిధ రంగాలకు చెందిన శేషగిరిరావు, చిత్ర నిర్మాత దర్శకుడు చెలిమి సుందరరావు చిత్ర విశేషాలను వివరించారు. సకల కళావేదిక కార్యదర్శి బోడి ఆంజనేయరాజు సభను నిర్వహించారు.

రేపు కవయిత్రి మొల్లమాంబ జయంతి

నున్న(విజయవాడరూరల్): విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈ నెల 13న కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమం జరుగుతుందని కృష్ణాజిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఐలాపురం వెంకయ్య, ఐలాపురం రాజా, ఐలాపురం భాస్కర శ్రీనివాసరావు హాజరవుతున్నారని, కుమ్మరి, శాలివాహన కులస్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

ఉచితంగా నీటి తొట్లు పంపిణీ


మంచినీటి తొట్లు పంపిణీ చేస్తున్న గోకరాజు గంగరాజు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవిలో మూగజీవుల దాహార్తి తీర్చేందుకు జంతు ప్రేమికులకు ఉచితంగా నీటి తొట్లను పంపిణీ చేశారు. నగరంలోని సంభవ జీవ దయ గ్రూప్ చారిటీతో భవానీపురం ఐరన్ యార్డ్‌లోగల జీవకారుణ్య ఆశ్రమంలో మంగళవారం జరిగిన ఈ మంచినీటి తొట్లను పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ.. నోరు లేని మూగజీవుల దాహార్తి తీర్చే లక్ష్యంతో సంభవ జీవ దయ గ్రూప్ మంచినీటి తొట్లను పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని జీవకారుణ్య ఆశ్రమం నిర్వాహకులు మురాల వెంకటేశ్వర్లు నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సీపీఎం నాయకుడు బాబూరావు

ఇబ్రహీంపట్నం: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. ఇబ్రహీంపట్నం సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల జేబులు కొల్లగొడుతోందని ఎద్దేవా చేశారు. ఈ నెల 8 నుంచి ప్రజాచైతన్య యాత్రలు ప్రారంభించామన్నారు. 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలను అధ్యయనం చేసేందుకు ప్రజా చైతన్య యాత్రలు జరుపుతామన్నారు. ప్రజా సమస్యలపై మార్చి 22 నుంచి 28 వరకు మండలాలు, పట్టణాల్లో ఆందోళన చేపడతామని తెలిపారు. యాత్రలో భాగంగా అంతకు ముందు ఎన్టీటీపీఎస్ బూడిద చెరువును జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్‌తో కలిసి సందర్శించారు. బూడిద, వాయు కాలుష్యంతో ఎంతోమంది దీర్ఘకాలిక వ్యాధులతో మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో 6.7కిలో మీటర్ల పరిధిలో ఉన్న అమరావతి రాజధానికి సైతం కాలుష్యం సెగ తాకుతుందని హెచ్చరించారు. బూడిద వ్యాపారంతో పాలకపక్ష పార్టీల నేతలు రోజుకు రూ.కోటి చొప్పున ఏడాదికి రూ.365 కోట్లు సంపాదన వెనకేసుకుంటున్నట్లు చెప్పారు. నాణ్యతలేని బొగ్గు వినియోగంతో వాయు కాలుష్యం పెరిగి పర్యావరణం దెబ్బతింటుందని స్పష్టం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, ప్రజలకు ఉచిత వైద్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణం రూ.100 కోట్లు కేటాయించి మార్చి నెలాఖరు లోపు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జూపూడి వద్ద ఎన్టీటీపీఎస్ బూడిద చెరువును పరిశీలిస్తున్న బాబూరావు, కృష్ణ తదితరులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన పెంపొందించుకుని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని భవానీపురం ఎన్నారై కాలేజీ ప్రిన్సిపాల్ రాంబాబు ఆకాంక్షించారు. గొల్లపూడిలోగల ఎన్నారైస్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్ట్స్ నమూనాలతో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పంటల దిగుబడిని పెంచే సేంద్రీయ ఎరువుల తయారీ, గర్భస్థ శిశువు ఎదుగుదల సూచించే నమూనా, మానవ గుండె నిర్మాణం–పని చేసే విధానం, ఆటోమేటిక్‌గా అగ్నిప్రమాద నివారణ పరికరం, రోడ్డు ప్రమాదాలను ముందుగా సూచించే పరికరం వంటి నమూనాలను ఈ ప్రదర్శనలో విద్యార్థులు ఏర్పాటు చేశారు. పాఠశాల అకడమిక్ కో ఆర్డినేటర్ హరిణి మాట్లాడుతూ.. పిల్లలకు చిన్నతనం నుంచే సైన్స్‌పై ఆసక్తిని కలిగించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్నారైస్ ఇండియన్ స్ప్రింగ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ చైతన్య, డీన్ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ శ్రీరామ్, వైస్ ప్రిన్సిపాల్ దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నమూనా ప్రాజెక్ట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రాజెక్ట్‌లను ఆసక్తిగా తిలకిస్తున్న సందర్శకులు

పింఛన్ల కోసం సచివాలయం వద్ద ధర్నా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి అధికారంలోకి వచ్చి పది మాసాలైన కొత్త పెన్షన్లను మంజూరు చేయకపోవటం దారుణమని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అన్నారు. అర్హులైన వారికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ పెన్షన్ల సాధన సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో 51వ డివిజన్‌లోని సచివాలయం వద్ద మంగళవారం వృద్ధులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ.. కొత్త పెన్షన్లు మంజూరు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో దరఖాస్తు చేసినా ఆన్‌లైన్ చేయకుండా వృద్ధులను ఎంతకాలం తిప్పుతారని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు రద్దుచేసిన పెన్షన్లు పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు కె.సూరిబాబు, పెన్షన్ సాధన కమిటీ కన్వీనర్ సీహెచ్.దుర్గారావు, దుర్గాలక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


పెన్షన్ల కోసం ఆందోళన చేస్తున్న వృద్ధులు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడా పోటీలకు చురుగ్గా ఏర్పాట్లు

శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడస్పోర్ట్స్: ప్రజాప్రతినిధులు(ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ) క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్(ఐజీఎంసీ), డీఆర్ఆర్ స్టేడియంలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. పోటీలకు సిద్ధమవుతున్న ఐజీఎంసీ, డీఆర్ఆర్ స్టేడియాలను శాప్ ఏవో ఆర్.వెంకటరమణనాయక్, స్పోర్ట్స్ ఆఫీసర్ కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో అజీజ్, వీఎంసీ అమృత్ పథకం జేడీ డి.లత, శాప్ కోచ్‌లు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి రవినాయుడు మంగళవారం పరిశీలించారు. క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, టగ్‌వార్, 100 మీటర్ల రన్నింగ్ క్రీడాంశాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు శాప్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్రీడల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని శాప్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వీక్షకులకు, న్యాయనిర్ణేతలకు ప్రత్యేక గ్యాలరీలు, స్టేజ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. క్రీడల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.


టేబుల్‌టెన్నిస్ కోర్టులను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, శాప్ అధికారులు, కోచ్‌లు

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సదస్సుకు హాజరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 110 మంది విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన 'పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవలప్‌మెంట్' కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రభుత్వ నిర్వహిస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన పెంచుకున్నారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు.



పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవలప్‌మెంట్ సదస్సులో ఎస్ఆర్ఆర్ విద్యార్థులు